

# జగమెరిగిన సత్యం

కథానిక

టి. నాగేశ్వరరావు

“మరి, ఇంతకూ ఏమంటావురా జగం?” అన్నది భారంగా, మండిగంమీద కూర్చున్న తల్లి సుందరమ్మ.

వసారాలో మంచంమీద కూర్చున్న శివరామయ్య-చుట్టచివరను పళ్ళతో కొరికి—

“ఏమనేదేముంది? వాడికి యింతగా చెప్పాలీ. మనం ఏ పని చేసినా వాడిక్షేమం కోరే!” అన్నాడు గంభీరంగా.

“మా బాబు! మనం చెప్పినట్టు వినకండా ఎటుపోతాడు? అయిన సంబంధం. చేసుకోరా నాయనా.” అన్నది నాయనమ్మ.

జగం మాట్లాడకుండా కూర్చున్నాడు. అతనికి సంబంధం చేసుకోవటం సుతరామూ ఇష్టం లేదు. ఆ యింట్లో అతని ఇష్టానికి ఎక్కువ ప్రాముఖ్యం లేదు. కనుక తండ్రికి ఎట్లా సమాధానం చెప్పాలా అనేది ఆలోచిస్తున్నాడు.

“ఇందులో ఆలోచించడానికేముందిరా! వాళ్లు మనకు బంధువులు. వాళ్ళ మంచిచెడ్డలు మనకు తెలుసు, మన మంచిచెడ్డలు వాళ్ళకు తెలుసు. మర్యాద, గౌరవం-అంటావా! ఆయన వ్యవహార జ్ఞాని. వాటికేం వంక పెట్టనవసరం లేదు. నిక్షేపంలాంటి పదెకరాల మాగాణిభూమి ఉంది. ఒక్కటే ఆడపిల్ల. తల్లి లేదు. లేకపోయినా అమ్మమ్మ ఉండి పిల్లని సరైన సంరక్షణలో ఉంచింది. స్కూలుఫైనలువరకూ చదువుకుంది. ఇంకా ఏమిటిరా నీ సందేహం?” ఆ చివరివాక్యం నొక్కి పలికాడు, తండ్రి శివరామయ్య.

“అయిన సంబంధం. వాళ్లు యిస్తామని కాళ్లదగ్గిరకు వచ్చారు. కాదంటే మనకే పరువు తక్కువ. ఊళ్ళో నలుగురూ ముక్కులమీద వేళ్లు వేసుకుంటారు. నా మాట విని. ఒప్పుకో. ఈ నెలలో మంచిమంచిముహూర్తాలున్నాయి” అన్నది సుందరమ్మ.

జగం నోరు విప్పలేదు. పిల్ల ఏమంత అందమైంది కాదు. తనకంటె ఒక చాయ తక్కువే! ఆ పిల్లని తను చాలసార్లు చూశాడు.

“పెద్ద డాబా - నాలుగు దూలాల పెంకుటి చావిడీ, లంకంత దొడ్డీ-పదివేల వరకూ నిల్వ ఉన్నది. రవ్వంత ఒక చాయ తక్కువైతే మతుకేం-పిల్ల అందమైందే. ఈడూ, జోడూ బాగా కుదురుతుంది. చేసుకోరా!” అన్నది నాయనమ్మ.

“నాకు ఇష్టంలేదు” అన్నాడు జగం అతి కష్టంమీద.

ఇంట్లో అందరికీ కోపం వొచ్చింది. శివరామయ్య పరవొళ్లు తొక్కాడు. సుందరమ్మ కోపంలోకూడా కంట తడిపెట్టింది. నాయనమ్మకు కాలంమీద కోపం వొచ్చింది.

“ఎందు కిష్టంలేకపోవాలీ బి. ఏ. తప్పిన నీ ముఖానికి ఇంతకంటె మంచి పిల్ల రాబోయిందా? ఇంట్లో అందరికీ ఇష్టమైనసంబంధం నీకు ఎందుకు పనికి రాకపోయిందీ!” అన్నాడు శివరామయ్య.

“ఇటువంటి విషయాల్లో తల్లిదండ్రుల మాట వినుకోవాలిరా. అమ్మాయి నెమ్మదస్తురాలు. ఆస్తి చాల వొస్తుంది. ఈ సంబంధం వొదులుకుంటే ఇక నీకు అంత కట్నంవొచ్చే పిల్ల దొరకదురా!” అన్నది సుందరమ్మ.

"అయిన వాళ్ళలో పనికదా అని సూర్యనారాయణ ఆస్తి తక్కువైనా నీకు ఇస్తానంటున్నాడు. నువ్వెందుకు కాదంటావు? మా అందరి మాటా విని చేసుకో" నాయనమ్మ బ్రతిమాలింది.

జగం ముఖం సీరియస్‌గా మార్చాడు.

శివరామయ్యకు కొడుకు పద్ధతి నచ్చలేదు. కొడుకు ఆక్కర్లేదనే కారణాలుకూడా ఆయనకు కనపడలేదు. వాటిని తెలుసుకొనే ఉపాయం కూడా ఆయన ఆలోచించదల్చలేదు. తను ఇంత డబ్బు ఖర్చుచేసి కొడుకును బస్తీలో చదివిస్తే-చివరకు తనకి ఎదురు తిరుగుతాడా? అన్న నిరంకుశత్వం ఆయనలో ఒక కాఠిన్యాన్ని, ఆగ్రహాన్ని ఏర్పరచింది. కొన్నికొన్ని విషయాల్లో తండ్రులకు కొడుకులమీద ఉన్న అభిమానం కాఠిన్యంతోనూ, ఆగ్రహంతోనూ కూడుకొని ఉంటుంది.

"నువ్వు ఈ సంబంధం తప్పకుండా చేసుకోవాల్సిందే. నేను గట్టిగా చెప్తున్నాను. నీ పెళ్ళి నీ ఇష్టంమీద ఆధారపడిలేదు. పెళ్ళితో నీమీద మేం కొంత బాధ్యతని తొలగించుకోవటం విధి. కనుక మేం చెప్పినట్టు నువ్వువినాలి. ఐన సంబంధం ఆస్తి బయటి వాళ్ళకు పోకుండా మనలోనే ఉంటుంది. అయిన సంబంధాలు చేసుకొని ఆస్తిపరులైనవాళ్ళు చాలామంది ఉన్నారు. ఆఖరిసారిగా చెబుతున్నాను. ఈ సంబంధం నువ్వు చేసుకుతీరవల్సిందే! నీకు ఇష్టం లేకపోయినా లగ్నం పెట్టించుకువస్తాను" అని విసురుగా బజారుకెళ్ళాడు శివరామయ్య పైపంచ భుజానవేసుకొని.

"మీ నాన్న కోపంలో ఉన్నాడు. ఒప్పుకోరా నాయనా" అని ప్రాధేయపడ్డది తల్లి.

నాయనమ్మ త్వరపెట్టింది ఒప్పుకోమని.

జగం మెత్తబడ్డాడు. అతనికి ఆలోచించుకోగా ఒకవిధాన మంచిదేమోనన్న భావం కలిగింది. ఇంట్లో ఎదిరించి ఇంకోపిల్లను పెళ్ళిచేసుకోవడం పడదు అన్న విషయంకూడా అతని ఆలోచనకి తగిలింది.

"ఒప్పుకున్నానమ్మా" అన్నాడు జగం.

తల్లి సుందరమ్మ ముఖం అంతలోనే సంతోషంతో కాంతివంతమైంది.

నాయనమ్మ ఆనందంబాష్పాలు రాల్చింది.

సుందరమ్మ భర్తని వెంటనే పిలిచికొని రమ్మని జీతగాడ్ని బజారుకు తరిమింది.

* * *

జగం పెళ్ళి జరిగింది.

పెళ్ళికి వచ్చిన వారికి మర్యాదలు చక్కగానే జరిపాడు సూర్యనారాయణ. కాని శివరామయ్యా, సుందరమ్మా, నాయనమ్మా, మరికొందరుచుట్టాలూ తృప్తిపడలేదు. పెళ్ళికి ముందు ఉన్న కాంతి శివరామయ్యముఖంలో తరువాత లేదు. సుందరమ్మముఖంకూడా పెళ్ళిజరిగాక వాడిపోయింది. అందుకు ముఖ్యమైన కారణం ఏమిటంటే: జగం తలిదండ్రులు సూర్యనారాయణ ఎక్కువకట్నం-(కనీసం ఆరు ఎకరాలూ, ఐదువేలరూపాయలూ) లగ్న మంటపంమీద చదివి యిస్తాడని ఆశించారు. కాని సూర్యనారాయణ మూడెకరాల పొలమూ, మూడువేల రూపాయలు రొక్కమూ చదివియిచ్చేటప్పటికి-వాళ్ళల్లో తాత్కాలికంగా ఆ మార్పు వొచ్చింది. పెళ్ళి పెద్దలు కొంతమంది కించిత్తు ఆశ్చర్యాన్ని కనపర్చారుగానీ, మరికొంతమంది "ఇప్పుడు చదివించకపోతేయేం? చివరకు అంతా పిల్లవెనుకవచ్చేదేగా" అని సరిపెట్టుకున్నారు. జగం తల్లిదండ్రులకేసి చూశాడు. వాళ్లు విచారక్రాంతులై ఉండటాన్ని చూసి నవ్వుకున్నాడు.

వెండి సామాను కూడా ఎక్కువ పెట్టలేదు. ఒక బీరువాసటుకు అమ్మాయి తరుపు బంధువులు చదివించి ఇచ్చారు. మిగతాలాంఛనాలు ఏమంత సంతృప్తికరంగాలేవు.

ఒక సంవత్సరం జరిగింది.

ఆ సంవత్సర కాలంలో ఎక్కువ ఇంటిదగ్గరే ఉన్నాడు జగం. భార్య కాపురానికి వచ్చింది.

సూర్యనారాయణ కూతుర్ని కాపురానికి పంపటము శివరామయ్యా వగైరాలకు ఆశ్చర్యకరంగానే ఉంది. వాళ్లు అనుకోవటం: ఒక్కతేకూతురు గదా, అల్లుడ్ని తనఇంట్లో అట్టేపెట్టుకుంటాడని. కాని సూర్యనారాయణ ఆ విధంగా చేయలేదు.

జగానికి భార్యమీద మంచి అభిప్రాయమే ఏర్పడింది. నిజంగా ఆమె అమాయకురాలు. ప్రవర్తన చాలా మంచిది. నెమ్మదస్తురాలు.

ఆరోజు సాయంత్రం ధుమధుమలాడుతూ వచ్చాడు శివరామయ్య ఇంటికి బజార్నుంచి. ఆయనకు బజార్లో ఒక విషయం తెలిసింది. అప్పట్నుంచీ ఆయనకు శాంతిలేదు. వెంటనే ఇంటికి వచ్చాడు.

"ఏమిటండీ" అన్నది సుందరమ్మ చాటలో పోసుకొని బియ్యంయేరుతూ.

"ఏముంది? అయిన సంబంధం చేసుకున్నందుకు సూర్యనారాయణ మనకొంప ముంచాడు?" అన్నాడు శివరామయ్య కోపంగా.

"ఏం చేశాడు?"

"ఇంకా ఎంచేయాలి? మళ్ళీ పెళ్ళి చేసుకోబోతున్నాడట."

"ఆ! నిజంగానే నా?"

"కావొచ్చు. వెంకయ్యగారి అక్కయ్యవాళ్లు చుట్టాల ఇంటికి వచ్చాడు. ఇందాక బజార్లో కనబడి యీ విషయం చెప్పాడు."

వంటఇంట్లో ఉండి జగం భార్య సావిత్రి అంతా విన్నది.

తన తండ్రికి ఇప్పుడు ఎట్లా కలిగింది ఈ బుద్ధి? ఎవరో చెప్పివుంటారు—అనుకుంది సావిత్రి.

"ఆయనకు అదేంకాలం వొచ్చిందో. ఇన్నేళ్ళకు కూతురుకు పెళ్ళిచేసి—తను పెళ్ళి చేసుకుంటున్నాడా?" అన్నది సుందరమ్మ ఆశ్చర్యంగా.

నాయనమ్మ విస్తుపోయింది.

పొలాన్నుంచి అప్పుడే వొచ్చిన జగం కూడా విన్నాడు అంతా. ఏమనలేకపోయాడు. శివరామయ్య మటుకు నోటికి వొచ్చినట్టు అంటూన్నాడు. సావిత్రి వినలేక చెవులు మూసుకుంది.

"ఏళ్ళు వచ్చినయ్. ఎందుకూ! ఇప్పుడు పెళ్లి కావాల్సి వొచ్చిందీ! అయిన సంబంధమని నమ్మితే ఇంతపని చేస్తాడూ? బుద్ధిలేదూ! ఈ విధంగా శివరామయ్య నోటికొచ్చినట్టు తిట్టాడు.

ఆ రాత్రి శివరామయ్య భార్యతో సంప్రదించి ఒక నిర్ణయానికి వొచ్చాడు. ఏమిటంటే,సావిత్రిని తండ్రిదగ్గిరకు పంపించి-తండ్రికి బుద్ధిచెప్పించటం.

మరునాడు ఉదయం సుందరమ్మ గట్టిగా చెప్పింది సావిత్రితో.

"ఒసేవ్ అమ్మాయ్. మీ నాన్న మళ్ళీ యిన్నేళ్ళు వచ్చాక పెళ్ళీ చేసుకుని నీకు అన్యాయం చేయబోతున్నాడు. అయిన సంబంధంమని మేం నమ్మి చేసుకుంటే మీ నాన్న ఇంత విడ్డూరాన్ని తలబెడతాడా! నువ్వు వెళ్లి ఈ విషయం మీ నాన్నతో చెప్పు. కాళ్ళా వేళ్ళా బ్రతిమాలియైనా పెళ్ళి మానిపించు."

సావిత్రి కంటతడిపెట్టింది.

"నా మాట వింటారా?" అన్నది మెల్లగా.

"ఎందుకు వినడు? నువ్వు ఏడుస్తూ చెబితే సరి. వినక ఏం చేస్తాడు? ఇదేవో ఆయనకు పుర్రెతో పుట్టిన బుద్ధికాదు. ఎవళ్ళో వాళ్ళు చెప్పి ఇట్లాచేసి ఉంటారు. అంతే! నీ ఏడుపుకైనా గుండె కరుగుతుంది" అని ప్రబోధించింది, సుందరమ్మ.

సావిత్రి ఏమనలేకపోయింది

సుందరమ్మ పుట్టింటికి సావిత్రినిరైలెక్కించింది.

* * *

మూడోరోజు సాయంత్రానికి సావిత్రి తిరిగి వచ్చింది. ఆమె ముఖం కళగా లేకపోవటంచేత వాకిట్లోకి రావటంతోనే కనిపెట్టింది, సుందరమ్మ పోయినపని ముక్కచెక్కలైందని. సావిత్రి అత్తమామలకు ముఖం ఎట్లా చూపించటమా అన్న దిగులుతో ఉన్నది.

కోడలు ఒంటెద్దుబండీలో స్టేషన్నుంచిరావటం బజార్లోచూసి శివరామయ్య ఇంటికి వొచ్చాడు.

"ఏమే. ఏమన్నాడు మీనాన్న?" అన్నది సుందరమ్మ.

సావిత్రి మాట్లాడలేదు. దుఃఖపుతెర పొంగుకొచ్చింది కానీ, సంబాళించుకుంది.

"సూర్యనారాయణ ఏమన్నాడమ్మాయి?" అన్నాడు శివరామయ్య.

"మాట్లాడవేమ్!" గద్దించింది సుందరమ్మ.

"నా మాట వినలేదు" అన్నది సావిత్రి.

సుందరమ్మా, శివరామయ్యా ఒకళ్ళముఖాలు ఒకళ్లు చూసుకున్నారు.

"మరి ఏమన్నాడూ?" అన్నాడు శివరామయ్య కోపంగా.

"పెళ్ళిచేసుకుంటాడట."

"పెద్దకాలంలో పడలేకపోయాడూ! ఏభైయేళ్ళు రాబోతున్నాయ్ పెళ్ళిచేసుకుంటాడూ? లోకం ముఖాన ఉమ్మివేస్తుందనే జ్ఞానం ఎట్లాలేక

పోయింది" అన్నాడు శివరామయ్య చీదరించుకుంటూ.

"ఆ మాట అన్నతరువాత నువ్వు ఇక్కడికి ఎందుకొచ్చావే. మమ్మల్ని మోసంచేస్తావా? అయిన సంబంధమని ఆశపడి పిల్లను చేసుకొంటే ఆ పెద్దమనిషి ఇట్లా నాటక మాడతాడూ?" దీర్ఘాలు తీసింది సుందరమ్మ.

"నువ్వు ఇక్కణ్నుంచి పో, మీనాన్న పెళ్ళి మాన్పిస్తావా మాన్పించు. లేకపోతే ఇక్కడికి రావొద్దు. మీ నాన్నదగ్గర్నే ఉండు" అన్నాడు శివరామయ్య.

సావిత్రి బావురుమన్నది.

"ఈ ఏడుపులు నాదగ్గర సాగవే పిల్లా. మర్యాదగా బయటికినడిచి-మీ నాన్నకు బుద్ధిచెప్పు. లేదా కట్నంగా ఇచ్చిన పొలంగాక మూడెకరాలు పొలం రాయించుకొనిరా. ఆపైన మీ నాన్నను ఎట్లాగయినా ఊరేగనీ" అన్నది సుందరమ్మ.

"అవును" భార్య అభిప్రాయాన్ని బలపర్చాడు శివరామయ్య.

అప్పుడే బజారునుంచి వొచ్చిన జగం ఇంట్లో జరుగుతోన్న రాద్ధాంతమంతా విన్నాడు. తల్లి దండ్రులు భార్యమీద చేసే దౌర్జన్యమంతా కళ్ళారా చూశాడు.

జగంను చూడటంతో సావిత్రి "ఏమండీ" అన్నది జాలితొణికే గొంతుకతో.

జగం హృదయం కరిగి నీటికంటె తేలికైంది.

"పో ఈ ఇంట్లోంచి" అన్నాడు శివరామయ్య.

"మీ నాన్నదగ్గరకెళ్ళి మేం చెప్పినట్టు చేస్తేనే ఈ ఇంట్లోకి రానిచ్చేది" అన్నది సుందరమ్మ.

భార్య చేతులు పట్టుకొని ఇంట్లోకి తీసుకు వెళ్లుతూ- "నువ్వు ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు. నీకేం భయంలేదు" అన్నాడు జగం.

శివరామయ్యా, సుందరమ్మా వింతగా ఒక్కసారి నోళ్లు తెరచి వికంగా "అదేమిట్రా" అన్నారు, కొడుకులో హఠాత్తుగా ఏర్పడిన మార్పుని అర్థంచేసుకోలేక.

"అవును. అది ఇంట్లోంచి బయటికి వెళ్ళనక్కర్లేదు. తండ్రిని వేడుకో నవసరంలేదు. అయిన సంబంధం చేసుకున్నానుగా. మన మంచి చెడ్డలు వాళ్ళకు తెలుసు. వాళ్ళమంచిచెడ్డలు మనకు తెలును. వొచ్చిందేచాలు. రానిదానికోసం ప్రాకులాడటం దేనికి? సావిత్రిమీద మీరేం దౌర్జన్యం చేయక్కర్లేదు" అన్నాడు జగం ఆవేశపడుతూ.

సుందరమ్మా, శివరామయ్యా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఇద్దరూ కలిసి కొడుకు వంక చూశారు.

జగం సావిత్రి నడుంచుట్టూ చేయివేసి ఇంట్లోకి తీసుకు వెళ్ళాడు.

---

# అగ్నిశృంఖల

సుప్రసన్న

ద్వ్యధారాసి పథాల లోపల
వ్యధా జీవితరథపు గాడులు
పృథుతరంగ చలజ్జలధిలో
విధూతాశల వృథారవములు
దుఃఖావసాన విజయంలో
ప్రుక్కి పలుకని మూగ శంఖాలు
దిక్కాలాబాధ్య సత్యం—నును
చెక్కిళ్ళపై పుట్టుమచ్చలు
పుష్యమాసపు చలికాలంలో
రష్యన్ వాతావరణం దిగుమతి
'ఆష్యా'రాజ్యపు సరిహద్దుల్లో
సోష్యలిజానికి అడ్డం ఎగుమతి.
దీక్షాధృతపీడిత హృదులల్లో
రూక్షారుణ శివనయనజ్వాలలు
కుక్షింభర నిర్జీవకృతుల్లో
సాక్ష్యంరాని మహాశ్రుకణమ్ములు
ఆధారంలేని నైరాశ్యంలో
కృధాజీవితపు తప్పటడుగులు
బాధామయ జీవితకణాల్లో
శోధనకందని అణుగర్భమ్ములు.